# నమస్తే తెలంగాణ

# మహబూబాబాద్

5 | వరంగల్, బుధవారం 30 ఏప్రిల్ 2025 | MAHABUBABAD


# ఎల్కతుర్తి సభ చారిత్రక ఘట్టం..

- రజతోత్సవానికి స్వచ్ఛందంగా వచ్చిన ప్రజలు
- ఎన్ని కుట్రలు పన్నినా సూపర్ డూపర్ హిట్
- అద్భుతంగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలు
- విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- టెలీ కాన్ఫరెన్స్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : ఎల్కతుర్తిలో కనీవినీ ఎరుగని రీతిలో లక్షలాది మందితో నిర్వహించిన బీఆర్ఎస్ 25 వసంతాల రజతోత్సవ సభలో జనం కాదు.. అది ప్రభంజనమని, తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే మరో ఘట్టమని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని పలువురు పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రభుత్వం పోలీసులతో కలిసి సభను అడ్డుకునేందుకు ఎన్ని కుట్రలు పన్నినా..ప్రజలను రానివ్వకుండా చేసినా వందశాతం సూపర్ డూపర్ సక్సెస్ కావడం ఒక చరిత్ర అని అన్నారు. నభూతో..నభవిష్యత్ మాదిరిగా జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ అటు పార్టీ శ్రేణుల్లోనూ.. ఇటు ప్రజల్లోనూ స్ఫూర్తి నింపిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచి.. ప్రజలకు ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. రజతోత్సవ సభకు సంబంధించిన ప్రతి పనిని పట్టణ, మండలం, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు చాలా అద్భుతంగా చేశారన్నారు. అంతటా పార్టీ గద్దెలను నిర్మించుకొని జెండాలు ఆవిష్కరించుకోవడంతోపాటు వాల్ రైటింగ్స్, వాల్ పోస్టర్లను అతికించడం, కొందరు ప్రత్యేకంగా వాల్‌పోస్టర్ తయారు చేయించుకొని, ఫ్లెక్సీలు, బ్యానర్లు చేయించుకొని సోషల్ మీడియా ద్వారా సభ గురించి బ్రహ్మాండంగా ప్రచారం చేశారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే పల్లా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి కేసీఆర్ పట్ల ఉన్న ప్రేమను చాటి చెప్పారన్నారు. తిరుగు ప్రయాణంలోనూ జనగామ నియోజకవర్గంలో అడుగుపెట్టిన మొదలు నుంచి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం వరకు దారి పొడవునా నాయకులు, కార్యకర్తలు చూపించిన ప్రేమ, ఆప్యాయత మరువరానిదంటూ స్వయంగా కేసీఆరే ప్రత్యేక అభినందనలు తెలిపారన్నారు. ఎల్కతుర్తి సభాస్థలి నుంచి ఎర్రబెల్లి వరకు వందలాది వాహనాలతో ముందుండి కేసీఆర్‌ను గమ్యస్థానానికి చేర్చిన జనగామ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

## కేసీఆర్‌తోనే అందరికీ సంక్షేమ ఫలాలు

- అందుకే మళ్లీ ఆయన పాలన కోరుకుంటున్న ప్రజలు
- కాంగ్రెస్ పార్టీ పథకాలు ఏ గ్రామంలో పూర్తిగా అమలు చేశారు
- ఆ పార్టీ నాయకులు చర్చకు రావాలి
- మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 29 : కేసీఆర్ హయాంలోనే అన్ని రకాల సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని, అందుకే మళ్లీ ఆయన పాలన కోరుకుంటున్నారని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి అన్ని వర్గాల ప్రజలు భారీ ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. ఐదు మండలాల నుంచి పదివేల మందిని తరలించాలనుకుంటే 11 వేల మంది వచ్చారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే సీఎం రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందడం లేదని, గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కేవలం అధికారంలోకి రావడానికే కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని, వచ్చాక ప్రజలను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువత అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ గత పదేండ్ల కాలంలో అన్ని రంగాలను అభివృద్ధి చేస్తే మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక్క పథకం కూడా పూర్తిగా ప్రజలకు అందించడంలో విఫలమైందన్నారు. ఆ పార్టీ నాయకులైన బెల్లయ్య నాయక్, అద్దంకి దయాకర్ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ గురించి ఇష్టం వచ్చిన విధంగా మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ఏగ్రామంలో పూర్తిగా అమలు చేశారో చర్చకు రావాలని సవాల్ విసిరారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీయే అధికారం చేపట్టి అభివృద్ధి చేస్తుందన్నారు. రజతోత్సవ సభను విజయవంతం చేసిన మాజీ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామస్థాయి నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్, గోకుల రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్‌నాయక్, నర్సింగ్ వెంకన్న, కత్తుల ఎలేందర్, రామచంద్రూనాయక్, నవీన్ నాయక్, బొబ్బ వెంకటరెడ్డి, షరీఫ్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

## వడదెబ్బతో ఇద్దరి మృతి

బయ్యారం/ఐనవోలు, ఏప్రిల్ 29 : వడదెబ్బతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం ఇద్దరు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కస్తూరినగరం గ్రామానికి చెందిన కేలోత్ రంగ్యా(52) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పొలం పనులకు వెళ్లి వచ్చిన రంగ్యా తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. రంగ్యాకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన యాకర సాలమ్మ(75) కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నది. ఎప్పటిలాగా మంగళవారం కూరగాయలు అమ్మి మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ తగిలి స్పృహ కోల్పోయింది. ఇంటి దగ్గర ఎవరూ లేకపోవడంతో కొద్దిపటికి తర్వాత చుట్టుపక్కల వారు గమనించి నీరు తాగించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందింది. సాలమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

## 'పెద్ది'ని అభినందించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



మాజీ ఎమ్మెల్యే పెద్దిని అభినందిస్తున్న హరీశ్‌రావు

నర్సంపేట, ఏప్రిల్ 29: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అభినందించారు. మంగళవారం హైదరాబాద్‌లో హరీశ్‌రావును పెద్ది సుదర్శన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ విజయవంతం అయ్యేలా కృషి చేసినందుకు పెద్ది సుదర్శన్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. రజతోత్సవ సభతో కార్యకర్తల్లో నూతనోత్సాహం వచ్చిందన్నారు. పెద్ది వెంట బీఆర్ఎస్ నర్సంపేట నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర ఉన్నారు.

- కార్యాచరణ ప్రకటించిన రాష్ట్ర జేఏసీ
- నేడు పెన్‌డౌన్ కార్యక్రమం
- పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్

# ఉపాధి సిబ్బంది ఆందోళన బాట



అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు

**ఉపాధి హామీ సిబ్బంది** ఆందోళనకు సిద్ధమయ్యారు. వేతనాలు సరిగా రాకపోవడం, అది కూడా ఏడాది కాలంగా నాలుగు నెలలకోసారి ఇస్తుండడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్న ఈజీఎస్ ఉద్యోగులు, క్షేత్ర సహాయకులు నేటి నుంచి నిరసన బాట పట్టనున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం పే స్కేల్ అమలు చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, ప్రతి నెలా వేతనం అందించాలనే డిమాండ్ నేపథ్యంలో ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగుల జేఏసీ కార్యాచరణ ప్రకటించింది. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్లు, డీఆర్‌డీవోలకు వినతిపత్రాలు ఇవ్వగా నేడు, రేపు పెన్‌డౌన్, షట్‌డౌన్ చేసి సహాయ నిరాకరణ చేయనున్నారు. అలాగే 2న ప్రజాభవన్, సీఆర్‌డీ వద్ద శాంతియుతంగా నిరసనలు, 3న మంత్రులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేయనున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు దిగుతామని సిబ్బంది స్పష్టం చేశారు.

- హనుమకొండ, ఏప్రిల్ 29

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది ఆందోళనకు సిద్ధమవుతున్నారు. చాలీచాలని వేతనంతో జీవనం సాగిస్తున్న వారికి సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ ఫీజులు, వంట సామాన్లు, ఇంటి కిరాయి, కరెంట్ బిల్లు, పాల బిల్లు, నెలనెలా ఈఎంఐలు ఇతరత్రా చెల్లింపులు చేయలేక ఇబ్బందులు పడుతున్నామని, కనీసం ఆఫీసుకు వెళ్లేందుకు పెట్రోల్, ఆటో చార్జీలు కూడా లేవంటే పరిస్థితి ఎంత దయనీయంగా మారిందోనని వాపోతున్నారు. సంవత్సర కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న అడ్మిన్ బిల్లులు విడుదల చేయాలని మంత్రిని కలిసి విన్నవించుకున్నా ఇప్పటివరకు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పేస్కేల్ ఇస్తామని, ఫైల్ పెట్టమని ఉన్నతాధికారులను ఆదేశించినప్పటికి ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదంటున్నారు. కార్యాచరణలో భాగంగా మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీనుకు వినతిపత్రాలు అందజేశారు. కాగా సిబ్బంది సమ్మెకు దిగితే గ్రామాల్లో ఉపాధి పనులకు ఆటంకం కలుగనుంది. అంతేకాక కూలీలు సైతం ఇబ్బందులు పడే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో ఈజీఎస్ సిబ్బంది వివరాలు**

| జిల్లా | పోస్టు | ఏపీవోలు | ఈసీలు | సీవో, ఏపీఎస్ | కాంట్రాక్ట్ ఉద్యోగులు | అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు | ఎఫ్ఏ | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|
| హనుమకొండ | 03 | 12 | 10 | 20 | 02 | 18 | 141 | 206 |
| జనగామ | 02 | 08 | 08 | 13 | 02 | 14 | 174 | 221 |
| జ. భూపాలపల్లి | 03 | 09 | 08 | 15 | 02 | 14 | 141 | 192 |
| మహబూబాబాద్ | 01 | 09 | 09 | 19 | 01 | 12 | 220 | 271 |
| ములుగు | 02 | 06 | 05 | 12 | 01 | 18 | 103 | 147 |
| వరంగల్ | 02 | 11 | 10 | 22 | 04 | 20 | 182 | 251 |
| మొత్తం | 13 | 55 | 50 | 101 | 12 | 96 | 961 | 1288 |

### ఇదీ కార్యాచరణ

ప్రభుత్వం పేస్కేల్ అమలు చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, ప్రతి నెల వేతనం అందించాలనే డిమాండ్ నేపథ్యంలో ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగుల జేఏసీ కార్యాచరణ విడుదల చేసింది. ఈ క్రమంలో 29న జిల్లా కలెక్టర్లు, డీఆర్‌డీవోలకు వినతిపత్రాలు అందజేయడం, 30న జిల్లా, మండల కార్యాలయాల్లో ఈజీఎస్ సిబ్బంది ఆఫీసుకు హాజరై ఎంసీసీలో పెన్‌డౌన్, షట్‌డౌన్ ద్వారా సహాయ నిరాకరణ చేయడం. మే ఒకటిన పెన్‌డౌన్, షట్‌డౌన్, 2న ప్రజాభవన్, సీఆర్‌డీకి వెళ్లి శాంతియుతంగా నిరసనలు, 3న మంత్రులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించనున్నారు.

## ప్రాజెక్టుల రూపకర్త విద్యాసాగర్ రావు



విద్యాసాగర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్, పొన్నాల లక్ష్మయ్య

- సాగునీటి రంగంలో ఆయన సేవలు మరువలేనివి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య
- హనుమకొండ పార్టీ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమం

హనుమకొండ, ఏప్రిల్ 29: రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులపై ఆర్ విద్యాసాగర్ విశేషమైన అవగాహన కలిగి ఉండడంతో పాటు పలు ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. విద్యాసాగర్‌రావు వర్ధంతిని పురస్కరించుకొని హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలో తాగునీటి తండ్లాటను తీర్చడంలో ఆర్ విద్యాసాగర్‌రావు విశేష కృషి చేశారన్నారు. కేంద్ర జల కమిషన్‌లోని జల వనరుల మంత్రిత్వశాఖకు చీఫ్ ఇంజినీర్‌గా, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వానికి నీటిపారుదల సలహాదారుగా పనిచేశారని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి నీటి కేటాయింపులో అన్యాయాలను ఎత్తిచూపడంలో కీలకపాత్ర పోషించారన్నారు. నీటి పారుదల రంగానికి ఆయన చేసిన అపారమైన కృషికి డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ఆయన పేరు పెట్టారని గుర్తు చేశారు. ఫ్లోరైడ్ ప్రభావిత నల్లగొండ జిల్లాకు సురక్షితమైన తాగునీటి కోసం, తెలంగాణ ప్రాంతంలోని బీడు భూములకు నీటిని అందించాలని ఆయన పోరాడారన్నారు. ప్రొఫెసర్ జయశంకర్, కేసీఆర్‌తో కలిసి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మన ప్రాంతానికి సాగునీటి రంగంలో జరిగిన అన్యాయాలను ఎండగట్టి ఆయన ఉద్యమానికి బలమైన పునాది వేశారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, డిండి లిఫ్ట్ ఇరిగేషన్, దేవాదుల, కంతనపల్లి, సీతారామ సహా పలు ప్రాజెక్టుల ప్రణాళిక, పునఃరూపకల్పనలో, మహారాష్ట్రతో అంతర్‌రాష్ట్ర ఒప్పందాలను సమన్వయం చేయడంలో, చెరువుల పునరుజ్జీవనం, పునరుద్ధరణ, మిషన్ కాకతీయ, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణ, మార్గదర్శకాలను రూపొందించడంలో ఆయన సహకారం అపారమైనదని గుర్తు చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ రజినీకాంత్, కార్పొరేటర్ మధు, డివిజన్ ప్రెసిడెంట్ అనిల్, మైనార్టీ నాయకుడు నయీముద్దీన్, నాయకులు వెంకన్న, రమేశ్, రాకేశ్‌యాదవ్, శ్రీకాంత్ చారి, రఘు, సంపత్, మహేశ్, నాగరాజు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాయిని అనుచరుడి వీరంగం

- రౌడీలు, జేసీబీలతో వచ్చి ఇల్లు ధ్వంసం
- బోరున విలపిస్తున్న బాధితులు





కాంగ్రెస్ నాయకుడు ధ్వంసం చేసిన ఇల్లు, ఇల్లు కూల్చుతున్న సమయంలో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు

నయింనగర్, ఏప్రిల్ 29 : తాను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మనిషినని, ఆయన అను చరుడు కోన శ్రీకర్ రౌడీలు, జేసీబీలతో వచ్చి బెదిరించి ఇంటిని ధ్వంసం చేసినట్లు బాధితులు వాపోయారు. బాధితురాలు చింతల స్వరూప తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వడ్డేపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆనుకొని ఉన్న ప్రాంతంలో తన మామ(భర్త తండ్రి) చింతల వెంకట్రాంనర్సయ్య నుంచి సంక్రమించిన ఇంట్లో 30 ఏళ్లుగా ఉంటున్నాం. కరెంట్ మీటర్, ఇంటి పన్ను కడుతున్నాం. అయితే, మంగళవారం నేను, నా కూతురు, ఆమె చిన్నపిల్లలు ఇంట్లో ఉన్న సమయంలో ఎమ్మెల్యే నాయిని అనుచరుడు కోన శ్రీకర్ కొంత మంది రౌడీలు, జేసీబీలతో వచ్చి బెది రించి సెల్‌ఫోన్లను లాక్కొని ఇంటిని ధ్వంసం చేశారు. కాగా, ఉగాది పండుగ ముందు రోజు ఇలా గే జరగడంతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి వద్దకు వెళ్లి చెప్పుకొంటే అలా ఏమీ చేయరని హామీ ఇచ్చారు. మళ్లీ ఇప్పుడు ఎమ్మెల్యే ఫోన్ చేసి ఆ భూమి మీది కాదంట కదా అని అనడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

### 'నమస్తే' కథనంతో ఆగినా.. మళ్లీ నేడు రెచ్చిపోయి..


వారసత్వ భూమిని కబ్జా చేస్తున్నాడు

'వారసత్వ భూమిని కబ్జా చేస్తున్నాడు.. స్థానిక ఎమ్మెల్యే అనుచరుడినని బెదిరిస్తున్నాడు' అంటూ 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 5న కథనం ప్రచురితమైంది. దీంతో అంతా సద్దుమణిగిందని అనుకునే లోపే మళ్లీ ఇంటిని ధ్వంసం చేయడమేంటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2007లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు ఇవ్వగా, నేడు అదే ఇంటిని జేసీబీలతో కూలగొట్టి కబ్జా చేసేందుకు ఆ పార్టీ నాయకులే ప్రయత్నించడం ఏంటని పలువురు విమర్శిస్తున్నారు. గత నెల రోజుల నుంచి బాధితులు సుబేదారి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకు ఎలాంటి విచారణ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.



# మిగిలింది ఒక్కరోజే

**ఇంకా పూర్తికాని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వెరిఫికేషన్**

- ఫీజులు చెల్లించడంలో ఇబ్బందులు
- రాయితీ కోల్పోతామన్న ఆందోళనలో దరఖాస్తుదారులు

**ఎల్ఆర్ఎస్ పథకంలో** ఫీజుపై 25 శాతం రాయితీకి గడువు ఒక్కరోజే మిగిలింది. తొలుత మార్చి 31తో ముగియగా ప్రభుత్వం ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. అప్పటి వరకు రాయితీ వర్తిస్తుందని ప్రకటించింది. అంతా బాగానే ఉన్నా ఫీజులు చెల్లించాలంటే మూడు శాఖలకు చెందిన అధికారులు దరఖాస్తుల పరిశీలన చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల వెరిఫికేషన్ పూర్తయితేనే దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించాల్సి ఉంది. ప్రతి రోజూ వందల మంది ఫీజులు చెల్లించేందుకు వస్తున్నప్పటికీ వివిధ స్థాయిలో వెరిఫికేషన్ పెండింగ్ ఉండడంతో ఫీజు జనరేషన్ కావడం లేదు. దీంతో గడువు ముగిసి రాయితీ కోల్పోతామని దరఖాస్తుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- వరంగల్, ఏప్రిల్ 29

ఎల్ఆర్ఎస్ చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాని సమయంలో ప్రభుత్వం వెరిఫికేషన్ చేయకున్నా ఫీజులు జనరేట్ చేసి దరఖాస్తుదారులకు పంపించారు. ముందు ఫీజులు చెల్లించండి.. తర్వాత వెరిఫికేషన్ చేస్తామంటూ అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో బల్దియా పరిధిలో సుమారు లక్షకు పైగా దరఖాస్తుల్లో 65 వేలకు పైగా దరఖాస్తులకు ఫీజులు జనరేట్ చేసి పంపించారు. వారిలో మార్చి 31 వరకు 14 వేలకు పైగా అర్జీదారులు రూ. 94 కోట్లకుపైగా ఫీజులు చెల్లించారు. అయితే ప్రభుత్వం దరఖాస్తుదారులకు మరో అవకాశం కల్పిస్తూ ఏప్రిల్ 30 వరకు రాయితీ గడువును పొడిగించింది. మార్చి 31 వరకు ఫీజులు జనరేషన్ కాని దరఖాస్తుదారులు ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వెరిఫికేషన్ తర్వాతనే ఫీజులు జనరేట్ అవుతున్నాయి. మూడు శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపంతో వేల దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయక పెండింగ్‌లో ఉండడంతో వారు ఫీజులు చెల్లించలేకపోతున్నారు. అధికారులు రెవెన్యూ వార్డులు, గ్రామాల వారీగా వెరిఫికేషన్ అధికారులను నియమించారు. మున్సిపల్ అధికారులు చాలా వరకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదు. దీంతో వేల దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి.

### రాయితీ చాన్స్ మిస్

మూడు శాఖల మధ్య సమన్వయ లోపంతో వేల మంది దరఖాస్తుదారులు 25 శాతం రాయితీ అవకాశం కోల్పోయే ప్రమాదం ఉంది. రాయితీకి గడువు ఒక్క రోజు మాత్రమే ఉండడంతో ఫీజులు చెల్లించేందుకు ముందుకు వచ్చినా వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉండి వీలు కావడం లేదు. దీంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వెరిఫికేషన్‌కు ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ వారు స్పందించడం లేదు. అది తమ పని కాదన్న రీతిలో వ్యవహరిస్తున్నారని పలువురు అర్జీదారులు ఆరోపిస్తున్నారు. ఫోన్లు చేసినా స్పందించడం లేదని వాపోతున్నారు. మూడు శాఖల అధికారుల నిర్లక్ష్యంతో వేల మంది దరఖాస్తుదారులు ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీ అవకాశం వినియోగించుకోలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

# ధాన్యం కొనాలని రోడ్డెక్కిన రైతులు

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్
- మంత్రి శ్రీధర్‌బాబు సొంత మండలం కాటారంలో ధర్నా
- 'వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన' అంటూ నినాదాలు



కాటారం : కాటారం-మంథని ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

మహదేవపూర్(కాటారం), ఏప్రిల్ 29 : ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రి శ్రీధర్‌బాబు సొంత మండలం కాటారంలో రైతులు రోడ్డెక్కారు. మంగళవారం కాటారం మండలం రేగులగూడెం గ్రామానికి చెందిన రైతులు కాటారం-మంథని ప్రధాన రహదారిపై ధాన్యం పోసి ధర్నా చేశారు. 'వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం దారుణమన్నారు. వెంటనే కేంద్రాలను ప్రారంభించి, కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నాతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నిరసన కార్యక్రమంలో రైతులు జిముడ వంశీ, అన్నవేన భీమరాజు, సమ్మయ్య, దావు రాజు, కుమ్మరి నగేశ్, వాసు, సోదారి సమ్మయ్య, గట్టు మల్లేశ్, మొగిలి, మనోహర్, భీమయ్య, రాజేందర్, అంకయ్య, వెంకటేశ్, బాపురెడ్డి, తిరుపతిరెడ్డి, సమ్మయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

**మన్నెగూడెంలో రైతుల నిరసన**

చిన్నగూడూరు: ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని చిన్నగూడూరు మండలం మన్నెగూడెంలో రైతులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బొడ్డు అశోక్, రామోజీ, లక్ష్మయ్య మాట్లాడుతూ ధాన్యం అమ్ముకునేందుకు జయ్యారంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు తరలించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటికీ అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు పడుతున్నామన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నిరసన తెలిపిన వారిలో రైతులు వెంకన్న, చంద్రయ్య, సోమన్న, నాగన్న, శ్రీను ఉన్నారు.

## యజమాని పేరుతో టోకరా

**గుమస్తా నుంచి రూ. 1.68 కోట్లు కొట్టేసిన సైబర్ నేరస్తుడు**

సుబేదారి, ఏప్రిల్29 : తను పనిచేసే సంస్థకు యజమాని అని గుమస్తాకు చెప్పి రూ. కోటీ 68 లక్షలు కొట్టేసిన సైబర్ నేరస్తుడిని సైబర్ సెక్యూరిటీ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం హనుమకొండలోని సీపీ కార్యాలయం సైబర్‌క్రైం పోలీస్ స్టేషన్‌లో ఇన్‌చార్జి ఏసీపీ ఫణీందర్ నిందితుడిని అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. హనుమకొండలోని ప్రముఖ హేచరీస్ సంస్థలో పనిచేస్తున్న గుమస్తాకు సైబర్ నేరస్తుడు ఈ నెల 19న కాల్ చేసి, 'నేను మీ ఓనర్‌ను. ఇది నా కొత్త ఫోన్ నంబర్. సేవ్ చేసుకో' అని చెప్పాడు. మరుసటి రోజు ఆ నంబర్‌కు గుమస్తా ఫోన్ చేయగా తాను బిజీగా ఉన్నానని చెప్పాడు. తర్వాత రోజు నేరగాడు ఫోన్ చేసి బ్యాంకు లావాదేవీల వివరాలు అడిగి తెలుసుకొని, తన బ్యాంకు ఖాతా నుంచి మరో ఖాతా నంబర్‌కు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయమన్నాడు. నిజమని నమ్మిన గుమస్తా రెండు దఫాలుగా రూ. కోటీ 68 లక్షలు బదిలీ చేశాడు. మరోసారి అతడు కాల్ చేయడంతో గుమస్తా అనుమానంతో యజమాని నంబర్‌కు కాల్ చేయగా అసలు విషయం బయటపడింది. ఖంగుతిన్న యజమాని, గుమస్తా సైబర్ నేరస్తుడి చేతిలో మోసపోయామని గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు దర్యాప్తు చేసి సైబర్ నేరస్తుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రతాప్‌గఢ్ జిల్లాకు చెందిన ప్రదీప్‌కుమార్‌గా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని ఏసీపీ ఫణీందర్ పేర్కొన్నారు.

## తిరుపతికి వీక్లీ స్పెషల్ రైళ్లు

**మే, జూన్ నెలల్లో 16 సర్వీసులు**

కాజీపేట, ఏప్రిల్ 29 : వేసవిలో తిరుమల-తిరుపతి దైవ దర్శనాలకు వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే శాఖ కాజీపేట రైల్వే జంక్షన్ నుంచి తిరుపతికి వారాంతపు స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మే, జూన్ నెలలో మొత్తం 16 ట్రిప్పులను నడుపుతున్నామని పేర్కొన్నారు. ఈ రైళ్లు కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి 07253 నంబర్‌తో మే నెలలో 06, 13, 20, 27న, జూన్‌లో 3, 10, 17, 24 తేదీల్లో ప్రతి మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి తిరుపతికి మరుసటి రోజు బుధవారం ఉదయం 9గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి 07254 నంబర్‌తో మే నెలలో 7, 14, 21, 28న జూన్‌లో 4, 11, 18, 25 తేదీల్లో ప్రతి బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు గురువారం ఉదయం 8 గంటలకు కాజీపేటకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు కాజీపేటలో బయల్దేరి వయా చర్లపల్లి, వికారాబాద్, గుంతకల్, గుత్తి, రాయచూర్, కడప, రేణిగుంట రైల్వేస్టేషన్ల మీదుగా నడుస్తుందన్నారు. మొత్తం 17 బోగీలతో 2 ఏసీ(డబ్ల్యూ), 1 ఏసీ(ఎన్), 8 సీఎన్, 4 జనరల్ బోగీలు, 2 ఎస్ఎల్ఆర్ బోగీలు ఉంటాయని, టికెట్ రిజర్వేషన్ ఉందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.